క్లుప్తంగా

పోస్టల్ కార్యాలయాల్లో ఎన్‌పీసీఐ లింకింగ్ ఖాతాలు

టెక్కలి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రయోజనాలను పొందడానికి పోస్టల్ కార్యాలయాల్లో ఎన్‌పీసీఐ ఖాతాలను తెరుచుకోవాలని టెక్కలి హెడ్ పోస్టల్ కార్యాలయం పోస్టుమాస్టర్ ఎస్.తిరుపతిరావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కేవలం 200 రూపాయలతో ఖాతాను ప్రారంభించుకుని తద్వారా ప్రభుత్వ ప్రయోజనాలు పొందాలని కోరారు.

కోటబొమ్మాళి: ఎన్‌పీసీఐ లింకుతో ఖాతాలను ప్రారంభించుకోవాలని కోటబొమ్మాళి సబ్ పోస్టుమాస్టార్ కింజరాపు ఆనంద్ ఓ ప్రకటనలో కోరారు. ఆధార్ నంబర్‌తో అనుసంధానం చేసి ఎన్‌పీసీఐ లింకుతో ఐపీపీబీ ఖాతా తెరుస్తామన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు పరామర్శ



రిమ్స్‌లో చికిత్స పొందుతున్న లక్ష్మీనారాయణను పరామర్శిస్తున్న నాయకులు

కంచిలి: వాహనం బోల్తా పడిన ఘటనలో పి.శాసనాం గ్రామానికి చెందిన పలువురు ఇటీవల గాయపడ్డారు. వీరిలో మామిడిపల్లి గాయత్రి మృతి చెందగా.. పలువురు శ్రీకాకుళంలోని పలు ఆస్పత్రుల్లో చికిత్సపొందుతున్నారు. క్షతగాత్రులను కంచిలి ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి మండల వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి వెళ్లి శుక్రవారం పరామర్శించారు. క్షతగాత్రులు మామిడిపల్లి దమయంతి, శీర లక్ష్మీనారాయణ, మామిడిపల్లి సున్నమ్మలను పరామర్శించి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. పరామర్శలో మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు యారడి ఆనందరావు, సర్పంచ్‌లు కొణపల సురేష్, గణప సింహాచలం, ఉప సర్పంచ్ బుడ్డెపు ఉన్నారు.

ప్రజా ఫిర్యాదుల విభాగానికి 17 వినతులు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

కాశీబుగ్గ: కాశీబుగ్గలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగానికి 17 వినతులు వచ్చాయి. ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి వినతులను స్వీకరించారు. పరిశీలన చేసి న్యాయం చేస్తామని వినతులు అందించినవారికి హామీ ఇచ్చారు.

బాలుడి వైద్యానికి ఆర్థికసాయం



సాయం అందజేస్తున్న వసంతరెడ్డి

టెక్కలి: సంతబొమ్మాళి మండలం కాకరాపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ముడిదాన సింహాచలం కుమారుడి వైద్యానికి సంతబొమ్మాళి జెడ్పీటీసీ సభ్యుడు పాల వసంతరెడ్డి తనవంతు సాయంగా రూ.5 వేలు అందజేశారు. కిడ్నీ సంబంధిత వ్యాధితో జిల్లా కేంద్రంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడిని శుక్రవారం పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు.

పాఠశాలలో న్యూట్రీగార్డెన్ ఏర్పాటు

కంచిలి: సేంద్రీయ ఎరువులు ఉపయోగించి కూరగాయలు, ఆకుకూరలు సాగుచేసే విధానాన్ని చొర్లాయిపురం ప్రాథమిక పాఠశాలలో చేపట్టేందుకు శ్రీకారం చుట్టారు. ప్రధానోపాధ్యాయుడు మద్దు తిరుపతిరావు ఆధ్వర్యంలో ఈ విధానాన్ని ప్రకృతి వ్యవసాయం ఐసీఆర్‌పీ శీర కామరాజు శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా న్యూట్రీ గార్డెన్ వేసే స్థలాన్ని చదును చేసి, బ్లాక్‌లుగా విభజించి ఘన, జీవామృతం వేసి తోటకూర, గోంగూర, పాలకూర, మెంతికూర, కొత్తిమీర, ఆవాలు, బీర, ఆనప, బరబటి, కాకర, బెండ, గోరు చిక్కుడు, వంకాయ, ముల్లంగి, క్యారట్ విత్తనాలను వేశారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కోటబొమ్మాళి: రైలు నుంచి జారిపడిన ఘటనలో సుమారు 35 ఏళ్ల యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ సంఘటన హరిశ్చంద్రపురం రైల్వే స్టేషన్ సమీపంలో వెలుగు చూసిందని పలాస రైల్వే ఎస్సై ఎస్‌కే షరీఫ్ శుక్రవారం తెలిపారు. భువనేశ్వర్ నుంచి వచ్చే సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ నుంచి జారిపడి మృతి చెంది ఉండవచ్చునని చెప్పారు. మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తరలించామన్నారు. మృతుడి శరీరంపై నలుపు రంగుచొక్కా, నెక్ బనియాన్ ఉందన్నారు. మృతుని సమాచారం తెలిసిన వాళ్లు 9440627567ను సంప్రదించాలని కోరారు.



ఉపాధ్యాయుల ఔదార్యం

కాకరపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న ఎం.అజయ్‌కుమార్ కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. విద్యార్థికి మండల ఉపాధ్యాయులు అండగా నిలిచారు. శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న విద్యార్థిని శుక్రవారం పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుకున్నారు. సేకరించిన రూ.70 వేలు నగదును విద్యార్థి తల్లిదండ్రులకు అందజేశారు. ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు హనుమంతు శివప్రసాద్, కె. వెంకటరమణమూర్తి, కె.పాపారావు, డి.గణపతిరావు, పి.శంకరరావు, పి.ఫాల్గుణరావు కాకరపల్లి పాఠశాల ఉపాధ్యాయులు సుదర్శనరావు, రవి ఉన్నారు. –సంతబొమ్మాళి



ప్రతిష్టా మహోత్సవం

ఇచ్ఛాపురం మండలం బూర్జపాడు గ్రామంలో వెలసిన ఉమామహేశ్వర స్వామి వారి ఆలయ సింహ ద్వారాన్ని పండితుల వేదమంత్రాల మధ్య శుక్రవారం ప్రతిష్ఠించారు.

ఈ సందర్భంగా విశేష పూజలతో 12 గంటల పాటు భజగోవిందం భక్తులచే హరేరామ హరేకృష్ణ నామ సంకీర్తనలతో గ్రామం మార్మోగిపోయింది. సింహద్వారా దాతలు శివంగి మోహనరావు, పుణ్యవతి దంపతులను ఆలయ నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో అధికసంఖ్య భక్తులు పాల్గొన్నారు. –ఇచ్ఛాపురం రూరల్



కుంకుమార్చనలు

కవిటి మండలం ఆర్.బెలగాంలో వెలసిన కాశీవిశ్వనాథాలయంలో శుక్రవారం సామూహిక కుంకుమార్చనలు వైభవంగా నిర్వహించారు. ప్రముఖ శక్తి ఉపాసకులు పెంట శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన 110 మంది మహిళలు సామూహిక కుంకుమార్చనల్లో పాల్గొన్నారు. ఏటా కార్తీక దీక్షల సందర్భంగా ఇక్కడ సామూహిక కుంకుమార్చనలు నిర్వహించడం సంప్రదాయంగా వస్తోందని జీరువంశీయులు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు. –కవిటి



ఉచిత న్యాయ సహాయం

అర్హులైన వారందరికీ ఉచిత న్యాయ సహాయం అందజేస్తామని టెక్కలి సీనియర్ సివిల్ జడ్జి (ఎఫ్ఏసీ) జె.శ్రీనివాసరావు అన్నారు. టెక్కలి ఆదిఆంధ్రావీధిలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. విద్యార్థి దశ నుంచే చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రతీ పౌరుడికి ప్రాథమిక హక్కులపై చైతన్యం ఉండాలని అన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.వి.వివేకానంద, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.అప్పారావు, వార్డెన్ బి.గణపతి, ఏఎస్ఐ కేశవ పాల్గొన్నారు. –టెక్కలి

చె(చి)త్త శుద్ధి ఏదీ?

- చెత్త సేకరణకు నిధులు లేమి
- వినియోగానికి దూరంగా సంపద కేంద్రాలు
- సిబ్బందికి అందని వేతనాలు



బొడ్డపాడులో నిరుపయోగంగా ఉన్న వర్మీ కంపోస్టు తయారీ కేంద్రం

పలాస:

కూటమి ప్రభుత్వానికి చెత్తశుద్ధిపై ఏమాత్రం చిత్తశుద్ధి లేకుండా పోయింది. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించి అమలు చేసిన సాలిడ్ వెల్త్ ప్రాసెసింగ్ సెంటర్లు(ఎస్‌డబ్ల్యూపీసీ) నేడు నత్తనడకన సాగుతున్నాయి. గతంలో క్రమం తప్పకుండా రోజూ గ్రామాల్లో ఇంటింటికీ గ్రీన్ అంబాసిడర్లు వెళ్లి తడి, పొడి చెత్తలను సేకరించేవారు. అందుకోసం ప్రతి ఇంటికి రెండు చెత్త బుట్టలు ఇచ్చారు. ఇళ్లల్లో ఉన్నటువంటి తడి, పొడి చెత్తను ఆ బుట్టల్లో వేసి చెత్తసేకరణ బండి రాగానే అందులో వేసేవారు. అలాగే వీధుల్లో చెత్త పేరుకుపోకుండా ఉండేందుకు ఘన వ్యర్థపదార్థాల నిర్వహణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అక్కడ తడి, పొడి చెత్తను వేరు చేసి ఆ కేంద్రాల్లో వర్మీకంపోస్టును తయారు చేసి రైతులకు విక్రయించేవారు. అందుకే ఈ కేంద్రాలను చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలుగా చెప్పేవారు. అయితే అప్పటి పరిస్థితులకు ఇప్పుడు పూర్తి భిన్నంగా తయారయ్యాయి. పలాస మండలంలో మొత్తం 19 పంచాయితీలు ఉన్నాయి. ఇందులో 16 పంచాయితీల్లో గ్రామ సచివాలయాలు పనిచేస్తున్నాయి. అయితే కేవలం 14 పంచాయితీల్లో మాత్రమే ఎస్‌డబ్ల్యూపీసీలు ఉన్నాయి. ఇవి కూడా సక్రమంగా పని చేయడం లేదు. వీటి పరిధిలో మొత్తం గ్రీన్ అంబాసీడర్లు 33 మంది పనిచేస్తున్నారు. ఈ సిబ్బందికి ప్రతి నెల వేతనాలు ఇవ్వాల్సి ఉండగా ఇప్పుడు మూడు నెలలకు ఒక సారి వారికి వేతనాలు అందుతున్నాయి. అయితే ఇవి కూడా ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితులు దాపురించాయి. దీంతో వారి పనితనంలో కూడా మార్పు వచ్చింది. రెండు మూడు రోజులకు ఒక సారి కూడా వచ్చిన దాఖలాలు లేవని గ్రామాల్లో ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో చెత్త ఎక్కడకక్కడ పేరుకు పోతుంది. చెత్త నుంచి సంపద కేంద్రాలు కూడా సక్రమంగా పనిచేయడం లేదు.

మండల వ్యాప్తంగా రోజుకు సుమారు మూడు టన్నుల చెత్తను గతంలో సేకరించిన సిబ్బంది ఇప్పుడు ఆ పని చేయలేకపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు దీనిపై దృష్టి పెట్టి ఈ కేంద్రాలను సక్రమంగా నిర్వహించడానికి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



చెత్తను సేకరిస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

వేతనాలు పెంచాలి



ప్రస్తుతం పెరుగుతున్న ధరలతో పోల్చినట్లయితే మాకు ఇచ్చిన కనీస వేతనం రూ.6 వేలు సరిపోవు. వేతనాలు పెంచాలి. అంతే కాకుండా ప్రతినెల వేతనాలు అందడం లేదు. మూడు నెలలకు ఒకసారి ఇస్తున్నారు. అవి కూడా ఎప్పుడు ఇస్తారో తెలియదు. మమ్మల్ని ప్రభుత్వం ఉద్యోగస్తులుగా గుర్తించాలి. తగిన గుర్తింపు ఇవ్వాలి.

– బదకల ఆదినారాయణ, గ్రీన్ అంబాసీడర్, బొడ్డపాడు

ప్రతి నెల బిల్లులు పెడుతున్నాం



గ్రీన్ అంబాసీడర్లకు వేతనాల కోసం ప్రతి నెల బిల్లులు పెడుతున్నాం. ప్రభుత్వం నుంచి రావాలి. అవి ఎప్పుడు వస్తే అప్పుడే వారికి నేరుగా వారి ఖాతాల్లోకి జమవుతాయి. ప్రస్తుతానికి పంచాయతీలకు నిధులు ఇబ్బంది ఏమీ లేదు. 15వ ఆర్థిక సంఘం నిధులు వచ్చాయి. గ్రామ పంచాయతీలకు కూడా కొన్ని రకాలు నిధులు వస్తుంటాయి. వాటి నుంచి వారికి వేతనాలు చెల్లిస్తున్నాం.

–లండ శ్రీధర్, పంచాయతీ కార్యదర్శి, లొద్దబద్ర, పలాస మండలం

మాజీ సీఎం జగన్‌ను కలిసిన ఇచ్ఛాపురం నాయకులు



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మండల పార్టీ నాయకులు

ఇచ్ఛాపురం రూరల్: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఇచ్ఛాపురం మండల పార్టీ నాయకులు శుక్రవారం విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇటీవల అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం నియోజకవర్గంలో అనుసరిస్తున్న ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యలు, స్థానిక సమస్యలను జగన్ దృష్టికి నాయకులు తీసుకొచ్చారు. లీగల్ అడ్వయిజర్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి టీమ్ సహకారంతో న్యాయ సహకారం పొందాలని జగన్ సూచించినట్లు నాయకులు. త్వరలో శ్రీకాకుళం పర్యటనకు వచ్చి కార్యకర్తలు, నాయకులతో విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించి భవిష్యత్ కార్యచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారని పేర్కొన్నారు. జగన్‌ను కలిసిన వారిలో సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు నర్తు నరేంద్రయాదవ్, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, మండల పార్టీ కన్వీనర్ పాతిర్ల రాజశేఖరరెడ్డి, సర్పంచ్‌లు నర్తు వరప్రసాద్, నీలాపు సారధిరెడ్డి, తడక జోగారావు, ఆశి దాలయ్యరెడ్డి, ఎస్.చిరంజీవి, ఇసురు తులసీరాం, పిట్ట బాలరాజు, బొబ్బిలి దేవరాజులు ఉన్నారు.

భర్త ఇంటి ఎదుట భార్య నిరసన



హరికృష్ణ ఇంటి ముందు కుమారుడు శ్రీరామ్‌తో కవిత

కాశీబుగ్గ: భర్త ఇంటి ఎదుట భార్య నిరసనకు దిగింది. వివరాల్లోకి వెళితే.. పట్టణానికి చెందిన తంగుడు హరికృష్ణకు 2013 ఆగస్టు 28వ తేదీన శ్రీకాకుళానికి చెందిన కవితతో వివాహమైంది. వీరికి పదేళ్ల బుద్ధి మాంద్యమున్న కుమారుడు శ్రీరామ్ ఉన్నాడు. కొడుకు బుద్ధిమాంద్యమున్న కావడంతో వదిలించుకోవడానికి హరికృష్ణ ప్రయత్నించాడు. తనతో ఉండాలంటే కొడుకుని వదిలేయాలని షరతు విధించాడు. అయితే కన్నకొడుకును వదిలేది లేదని కవిత తేల్చి చెప్పింది. దీంతో గొడవలు తలెత్తడంతో భర్తకు దూరంగా ఉంటుంది. ఈ క్రమంలో శుక్రవారం భర్త ఇంటి వద్దకు చేరుకొని నిరసన తెలియజేసింది. విషయం తెలుసుకున్న రాష్ట్ర స్థాయి వైశ్య సంఘ నాయకులు కల్పించుకున్నారు. ప్రస్తుతానికి అత్తవారింటిలోని ఓ గదిని కవిత, కుమారుడు శ్రీరామ్‌కు కేటాయించారు. దీనిపై శనివారం పెద్దల సమక్షంలో పూర్తిస్థాయిలో చర్చలు జరగనున్నాయి. కాగా తనకు న్యాయం చేయాలని కోరుతూ కవిత ఇప్పటికే జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసి ఉన్నారు.

బస్సులు యథావిధిగా నడపండి



సమీక్షలో ఎమ్మెల్యే శిరీష, ఆర్టీసీ అధికారులు

కాశీబుగ్గ: పలాస ఆర్టీసీ డిపో పరిధిలో రద్దయిన బస్సులను పునరుద్ధరించాలని ఎమ్మెల్యే గౌతు శిరీష సంబంధిత అధికారులను కోరా రు. ఆర్టీసీ ఉన్నతాధికారులు, ఎమ్మెల్యే.. పలాసలోని కార్యాలయంలో ఈ విషయమై సమీక్షించారు. 'సాక్షి' దినపత్రికలో శుక్రవారం ప్రచురితమై న 'కస్సు బస్సుల ప్రయాణం' శీర్షికతో వచ్చిన కథనానికి ఎమ్మెల్యే, అధికారులు స్పందించారు. శ్రీకాకుళం ఆర్టీసీ ఆర్ఎం ఆకాశ విజయకుమార్, పలాస డిపో మేనేజర్ సీతారామనాయుడు, పలాస ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి దిలీప్‌కుమార్, అధ్యక్షులు ఎం.ఎ.రాజులతో కలిసి సమీక్షించారు. పలా స, టెక్కలి, శ్రీకాకుళం-1, 2 డిపోల పరిధిలో రద్దు చేసిన 54 బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని నిర్ణయించారు.

రొయ్యల అక్రమ చెరువులను తొలగించండి

టెక్కలి: సంతబొమ్మాళి మండలంలో అక్రమంగా సాగు చేస్తున్న రొయ్యల చెరువులను తక్షణమే తొలగించాలని టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి సంబంధిత అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, వ్యవసాయ, మత్స్యశాఖ, ఇరిగేషన్, కాలుష్య నివారణ, అటవీ శాఖల సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో సుమారు 460 ఎకరాల్లోని ప్రభుత్వ భూముల్లో అక్రమంగా రొయ్యల చెరువులు సాగు చేస్తున్నట్లు సర్వే నివేదికలో తెలిసిందన్నారు. తక్షణమే వాటిని తొలగించే విధంగా అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో తహసీల్దార్ రమేష్‌కుమార్ ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం పట్టణ మాజీ అధ్యక్షుడు మృతి



కాళ్ల దేవరాజు (ఫైల్)

ఇచ్ఛాపురం: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, ఇచ్ఛాపురం పట్టణ పార్టీ మాజీ అధ్యక్షుడు కాళ్ల దేవరాజు (64) అనారోగ్యంతో శుక్రవారం సాయంత్రం మృతి చెందారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన్ని విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో కుటుంబసభ్యులు చేర్పించగా.. చికిత్స పొందుతూ ప్రాణం విడిచారు. ఈయనకు భార్య శకుంతలదేవి, కుమారులు మదన్, భానుప్రసాద్‌లు ఉన్నారు. దేవరాజు మృతిపై పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు సంతాపం తెలియజేశారు.

డిగ్రీ విద్యార్థుల క్షేత్ర పర్యటన



ఏయూ ప్రధాన గేటు వద్ద డిగ్రీ కళాశాల విద్యార్థులు

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె వెంకటలక్ష్మి పర్యవేక్షణలో ఆక్వాకల్చర్, జువాలజీ, కెమిస్ట్రీ విభాగాల ఆధ్వర్యంలో బీఎస్సీ విద్యార్థులు క్షేత్రపర్యటన చేపట్టారు. ఇందులో భాగంగా విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ, పరిసర ప్రాంతాలను శుక్రవారం సందర్శించారు. ఏయూలోని సైన్స్ లేబరేటరీని సందర్శించి పురాతనమైన 1948 నాటి తొలి నీలి తిమింగలపు అస్తిపంజరాన్ని, వారి పాఠ్యాంశాలకు సంబంధించిన అనేక జంతు అవశేషాలను పరిశీలించి వాటిపై సమగ్ర నివేదికను తయారు చేసుకున్నారు. అక్వాకల్చర్ విద్యార్థులు విషయ సేకరణకు విశాఖలోని ఫిషింగ్ హార్బర్‌ను సబ్ మైరైన్, పరిసరాలలో క్షేత్రపర్యాటక స్థలాలను సందర్శించారు. 40 మంది సైన్స్ విద్యార్థులతో పాటు కళాశాల ప్రధానాచార్యులు, వివిధ శాఖాధిపతులు ఉన్నారు.

అర్బన్ రీసర్వేపై సమీక్ష

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం పరిధిలో అర్బన్ రీ సర్వేపై మున్సిపల్ కార్యాలయంలో అధికారులు శుక్రవారం సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్బన్ రీ సర్వే ప్రాజెక్ట్ పునః ప్రారంభించాలని మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు సిబ్బందికి సూచించారు. పురపాలక సంఘ పరిధిలోని సచివాలయ అడ్మిన్స్, టౌన్ ప్లానింగ్ ఇంజినీర్లు, వీఆర్వోలు, ఎనిమిటీస్ సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

‘ఉల్లాస్’పై శిక్షణ



కంచిలి: మాట్లాడుతున్న ఎంపీడీవో తిరుమలరావు

ఇచ్ఛాపురం రూరల్: పదిహేనేళ్ల పైబడిన వారంతా అక్షరాస్యులుగా ఉండాలన్నదే నవ భారత్ సాక్షరత (ఉల్లాస్) కార్యక్రమం ఉద్దేశమని ఎంపీడీవో కె.రామారావు అన్నారు. మండలాభివృద్ధి కార్యాలయ సమావేశ మందిరంలో 'ఉల్లాస్' కార్యక్రమంపై వలంటీర్ ఉపాధ్యాయులు, వీవోఏలకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సెర్ప్ ఏపీఎం సనపల ప్రసాదరావు మాట్లాడుతూ.. ఉల్లాస్ విద్య వ్యక్తిగత ఎదుగుదలకు మార్గాన్ని ప్రకాశింపజేస్తూ, ఆశాకిరణంగా పనిచేస్తుందన్నారు. యువతీ, యువకులకు అక్షరాస్యత ద్వారా ఉజ్వల భవిషత్, సాధికారత కలిగిన పౌరులుగా తీర్చిదిద్దడమే ఈ పథకం ముఖ్య లక్ష్యమని అన్నారు.

సంపూర్ణ అక్షరాస్యతను సాధిద్దాం

కంచిలి: ప్రతి ఒక్కరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం ద్వారా సంపూర్ణ అక్షరాస్యతను సాధిద్దామని ఎంపీడీవో వి.తిరుమలరావు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. శిక్షణ పొందిన వలంటీర్ టీచర్లు, వెలుగు సీసీలు, వీవోఏలు మండలంలోని 15 సంవత్సరాలు వయస్సు పైబడిన నిరక్షరాస్యులను గుర్తించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలనీ ఎంపీడీవో కోరారు. ఐకేపీ ఏపీఎం ఎస్.ప్రసాదరావు, పంచాయతీ కార్యదర్శి రాంబాబు, డిజిటల్ అసిస్టెంట్ జగదీష్ ఉన్నారు.

కిడ్నీ ఆస్పత్రిలో పోస్టులు భర్తీ చేయాలని వినతి

కాశీబుగ్గ: పలాసలోని కిడ్నీ పరిశోధన కేంద్రంలో ఖాళీగా ఉన్న ఫార్మసీ ఆఫీసర్స్, డైటీషియన్ పోస్టులను భర్తీ చేయాలని ఏపీ ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీషను శుక్రవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఫార్మసీ ఆఫీసర్స్ జిల్లా అధ్యక్షులు సుబ్రహ్మణ్యం, కార్యవర్గ సభ్యులు ఉన్నారు.

కిడ్నీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి



మాట్లాడుతున్న మాధవరావు

పలాస: ఉద్దానం ప్రాంతవాసులను వణికిస్తున్న కిడ్నీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పలాస సూదికొండలోని ఆ పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఉద్దానం ప్రాంతంలో గత 20 ఏళ్లలో సుమారు 40 వేల మంది కిడ్నీ మహమ్మారి బారిన పడి మృత్యువాత పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. వేలాది మంది వ్యాధితో బాధపడుతున్నారని.. వీరిలో అత్యధిక శాతం మంది డయాలసిస్ చేయించుకుంటూ చావుకు దగ్గరలో ఉన్నారన్నారు. డయాలసిస్ చేయించుకోవడం తాత్కాలికమేనని ఇది పరిష్కారం కాదన్నారు. ఈ వ్యాధిని ముందుగానే గుర్తించి వారికి వ్యాధి నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని, అందుకు తగిన పరిశోధనలు చేయాలని కోరారు. తగిన సిబ్బందిని నియమించి, మెరుగైన వైద్య సేవలను అందించాలన్నారు. సమావేశంలో భారత కార్మిక సమాఖ్య జిల్లా కన్వీనరు జుత్తు వీరాస్వామి, రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు మామిడి భీమారావు, జిల్లా నాయకురాలు టి.సరస్వతి, పతివాడ షణ్ముఖరావు, ఆనంద్ బెహరా తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

ఘనంగా ఛాట్‌పూజ

కంచిలి: కంచిలిలో వివిధ వ్యాపారాల నిమిత్తం వలస వచ్చి నివసిస్తున్న ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన వారు ఏటా దీపావళి తర్వాత ఛాట్‌పూజను చేస్తుంటారు. ఇందులో భాగంగా శుక్రవారం మఠం కంచిలిలో ఉన్న జగన్నాథస్వామి ఆలయం ఆవరణలో ఉన్న చెరువులో వేకువజామున ఛాట్ పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఆర్డీవో కార్యాలయం ఏర్పాటుకు స్థల పరిశీలన

కాశీబుగ్గ: గత ప్రభుత్వ హయాంలో నూతనంగా ఏర్పడిన పలాస రెవెన్యూ డివిజన్‌లో కార్యాలయ భవనాల ఏర్పాటు కోసం అధికారులు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం పలాసలోని డ్వామా కార్యాలయంలో తాత్కాలిక కార్యాలయం నడుస్తుంది. దీంతో నూతన కార్యాలయం ఏర్పాటు కోసం కాశీబుగ్గ మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న ఖాళీ ప్రదేశాన్ని అధికారులు శుక్రవారం పరిశీలించారు. పరిశీలనలో ఆర్డీవో జి.వెంకటేశ్వరరావు, తహసీల్దార్ కల్యాణ చక్రవర్తి ఉన్నారు.

వెలుగు ఏపీఎంగా ప్రసాద్

వజ్రపుకొత్తూరు రూరల్: వజ్రపుకొత్తూరు మండల వెలుగు ఏపీఎంగా గొడబ ప్రసాదరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మందస మండలంలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కాశీబుగ్గ: ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. ఈ సంఘటన పలాస మండలం జాతీయ రహదారిపై లక్ష్మీపురం టోల్‌గేట్ వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. వజ్రపుకొత్తూరు మండలం మహాదేవపురం గ్రామానికి చెందిన అప్పలస్వామి, కృష్ణారావులు ద్విచక్ర వాహనంపై వస్తుండగా వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. ఈ ఘటననలో గాయపడిన అప్పలస్వామి, కృష్ణారావులను 108 వాహనంలో పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు.

బాలకార్మికులను ప్రోత్సహిస్తే చర్యలు

ఇచ్ఛాపురం: బాలకార్మికులను ప్రోత్సహించే షాపుల యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏఎల్‌వో విజయకుమార్ అన్నారు. ఇచ్ఛాపురం మున్సిపాలిటీ, మండలం పరిధిలో బాలకార్మికుల గురించి ప్రత్యేక డ్రైవ్‌ను శుక్రవారం నిర్వహించారు.

సైక్లిస్టుకు గాయాలు

కాశీబుగ్గ: బొలేరో వాహనం ఢీకొని సైక్లిస్టు గాయపడ్డాడు. పలాస మండలం చిన్నమాకన్నపల్లి గ్రామానికి చెందిన తెప్పలి సోమయ్య (62) సైకిల్‌పై వెళ్తుండగా బొలేరో వాహనం ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడిన ఆయన్ని పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

కవిటి: శిలగాంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఉపాధిహామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్‌లో భాగంగా శిలగాం గ్రామదేవత శ్యామలమ్మ ఆలయం నుంచి పాతశిలగాం వరకు 150 మీటర్ల దూరానికి రూ. 5 లక్షల నిధులు వెచ్చించి ఈ పనులు చేపడుతున్నారు. టీడీపీ నాయకులు భీమారావు, సర్వేశ్వరరావు ఉన్నారు.